www.aksharadarbar.com
శుక్రవారం 24, మే 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :95 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

కరెంట్ షాక్ తో లైన్ మెన్ మృతి

- విద్యుత్ స్తంభంపైనే ఘటన
- తీగలపై వేలాడిన డెడ్ బాడీ

02

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

- యువతి మృతి
- యువకుడిని ఆసుపత్రికి తరలింపు

02

రేపటితో ప్రచారానికి తెర

- నల్లగొండ –ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల శాసనమండలికి ఉప ఎన్నిక
- 27న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు
- బరిలో 52 మంది..
- ఓటు వేయాలని ఫోన్లలో కోరిన అభ్యర్థులు

02

నల్గొండ-ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నిక ప్రచారానికి శనివారంతో తెరపడనుంది. ఈనెల 2న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించారు. 9వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. 10న నామినేషన్ల పరిశీలన చేశారు. 13వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈనెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. వచ్చే నెల 5న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఎన్నికకు శనివారం సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. బరిలో 52 మంది ఉన్నారు. ఇప్పటికే బరిలో ఉన్న వారు ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయానికి వెళ్లి ఓట్లు వేయాలని కోరారు.

–అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి



నిర్లక్ష్యపు జబ్బు

ఆగిపోయిన ఆపరేషన్లు

- పేరుకే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి
- పరికరాలు ఉన్నా నిరుపయోగమే
- ప్రారంభంకాని ఎమర్జెన్సీ సర్వీసెస్
- ఇదీ పీఎంఎస్ఎస్ వై హాస్పిటల్ తీరు

04

కాకతీయ వైద్య కళాశాల ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆపరేషన్లు నిలిచిపోయాయి. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన కింద ప్రభుత్వం కాకతీయ వైద్యకళాశాల ఆవరణలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించారు. తాజాగా ఈ హాస్పిటల్ లో ఆపరేషన్లు నిలిచిపోవడం విమర్శలకు తావిస్తోంది. కొద్ది రోజులుగా ఆపరేషన్లు చేయకపోవడంతో బాధితులు ప్రవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని చికిత్సలకు ఆరోగ్య శ్రీ కింద ఉన్నా మరికొన్ని ఆరోగ్యశ్రీ పథకంలో లేవు. దీంతో ప్రైవేటులో డబ్బులు పెట్టి చికిత్స చేయించుకుంటున్న దుస్థితి. ఆస్పత్రిలో ఏసీలు పనిచేయని కారణం, ఇతర కారణాలతో యూరాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, ఆంకాలజీ, న్యూరో, పిడియాట్రిక్ విభాగాల్లో సర్జరీలు జరగడం లేదు. దీంతో ఆయా విభాగాల్లోని పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఎమర్జెన్సీ ఉంటే ఎంజీఎం ఆసుపత్రికే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అక్కడి నుంచి రోగి పరిస్థితిని బట్టి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ఏర్పడకుండా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ సర్వీసెస్ ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

–అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

04

ఈ నెల 27న నల్లగొండ- వరంగల్ - ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి (వరంగల్, హనుమకొండ, జనగామ) లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఓ ప్రకటనలో తెలిపారు.

-అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

కేసు దర్యాప్తులో అవకతవకలు

- పోలీస్ ఎస్సై సస్పెన్షన్
- ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు

02

27న ప్రత్యేక క్యాజువల్ సెలవు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రభుత్వ ఉద్యోగులకు వెసులుబాటు

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

03

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

ముగింపు దశకు ఎమ్మెల్సీ ప్రచారం

- శనివారం సాయంత్రంతో బంద్..
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల అధికారులు
- బరిలో 57 మంది

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నిక ప్రచారానికి శనివారంతో తెరపడనుంది. ఈనెల 2న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించారు. 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. 10న నామినేషన్ల పరిశీలన చేశారు. 13వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈనెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. వచ్చే నెల 5న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఎన్నికకు శనివారం సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. ఇప్పటికే బరిలో ఉన్న వారు ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయకు వెళ్లి ఓట్లు వేయాలని కోరారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఎక్కువగా ప్రచారం నిర్వహించారు. ఓటర్ల ఫోన్ నెంబర్లు సేకరించి అభ్యర్థులు ఫోన్లలో ఓట్లు అడిగారు. ఎవరికి వారు ధీమాతో ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం తీన్మార్ మల్లన్న వరంగల్ లో పర్యటించారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి తమదైన శైలిలో పట్టభద్రులను కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో మొత్తం 57 మంది ఉండగా, ప్రధానంగా ఈ ముగ్గురి మధ్యే పోటీ నెలకొంది.

ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి

ఖమ్మం – నల్గొండ – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ఓటు హక్కు నమోదు చేసుకున్న పట్టభద్రులు తమ ఓటు హక్కును పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని పి. ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నమోదు చేసుకున్న పట్టభద్రులకు ఓటర్ స్లిప్స్ అందించడం జరిగినదని, ఓటరు స్లిప్ అందని పట్టభద్రులు ttps://Ceote-langana.nic.in వెబ్ సైట్ లో తమ ఓటును పరిశీలించుకోవాలని ఆమె సూచించారు. ఈ వెబ్ సైట్ లో పోలింగ్ కేంద్రం, తదితర వివరాలు ఉంటాయని కలెక్టర్ వివరించారు.

కేసు దర్యాప్తులో అవకతవకలు

- భూంపల్లి ఎస్సై సస్పెన్షన్
- ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు

అక్షర దర్బార్, సిద్దిపేట: మామిడి తోటలో జరిగిన దొంగతనం కేసు దర్యాప్తులో అవకతవకలకు పాల్పడటంతో పాటు, భూ తగాదా కేసుల్లో బాధితులకు కాకుండా వారి ప్రత్యర్థులకు సహకారం అందిస్తుడంతో ప్రస్తుతం సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని భూంపల్లి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వి. రవికాంత్ ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ 1 ఐజీ ఏవీ రంగనాథ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం సస్పెండ్ అయిన ఎస్సై రవికాంత్ గతంలో మెదక్ జిల్లా శివంపేట్ ఎస్.ఐగా విధులు నిర్వహించారు. ఆ సమయంలో మామిడి తోటలో యాభై టన్నులకుపైగా మామిడి పండ్లు చోరికి గురైనట్లు సంబంధిత మామిడి తోట యజమానురాలు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై తక్షణమే కేసు నమోదు చేయకుండా అలసత్వం ప్రదర్శించాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై కొద్ది రోజుల అనంతరం కేసు సివిల్ కేసు పరిధిలోకి వస్తుందని పోలీస్ ఉన్నత అధికారులను తప్పు దోవ పట్టించాడు. అంతేకాదు దొంగతనం కేసును సివిల్ తగాదా కేసుగా ముగించేందుకు ఎస్సై రవికాంత్ అవకతవకలకు పాల్పడటంతో పాటు భూ తగాదా కేసుల్లో బాధితులకు కాకుండా వారి ప్రత్యర్థులకు సహకారం అందిస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా ఆరోపణలు వచ్చాయి. దీంతో మెదక్ జిల్లా ఎస్పీ అందజేసిన విచారణ నివేదికలో ఎస్సై రవికాంత్ పై వచ్చిన ఆరోపణలు నిజ నిర్ధారణ కావడంతో ప్రస్తుతం సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని భూంపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సైఐగా విధులు నిర్వహిస్తున్న వి. రవికాంత్ ను సస్పెండ్ చేస్తున్నట్లుగా మల్టీ జోన్ 1 ఐజీ ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

కరెంట్ షాక్ తో లైన్ మెన్ మృతి

అక్షర దర్బార్, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని మల్లికార్జునపల్లి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా విద్యుత్తు స్తంభం ఎక్కి పనులు చేస్తున్న లైన్ మెన్ విద్యుత్ షాక్ తో స్తంభంపైనే మృతి చెందటం హృదయాలను కలిచివేసింది. మల్లికార్జునపల్లెలో విద్యుత్ సరఫరాలో తలెత్తిన అంతరాయం పరిష్కారం కోసం స్థానిక లైన్ మెన్ శుక్రవారం విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తున్నాడు. ఈ సమయంలో అనూహ్యంగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కు గురైన లైన్ మెన్ విద్యుత్ స్తంభంపైనే ప్రాణాలు కోల్పోయాడు. ఊపిరి ఆగిపోవడంతో లైన్ మెన్ మృతదేహం కరెంట్ స్తంభంపైన తీగలపై వేలాడింది. ఈ హృదయవిదారక దృశ్యం స్థానికులను కలిచివేసింది. విధి నిర్వహణలో విద్యుత్ స్తంభంపైనే చనిపోయిన లైన్ మెన్ డెడ్ బాడీని చూసి కంటతడి పెట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభంపై వేలాడుతున్న లైన్ మెన్ మృతదేహం

27న ప్రత్యేక క్యాజువల్ సెలవు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

అక్షర దర్బార్, హైదరాబాద్:ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గంలో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ సెలవు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ, ములుగు, సిద్దిపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సీఎల్ ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రైవేట్ ఉద్యోగులకు సెలవు ఇవ్వాలని చట్టంలో లేదని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో సూచించారు. ప్రైవేట్ కంపెనీలు, వ్యాపార సంస్థలు తమ సిబ్బంది ఓటు వేసేందుకు వీలుగా షిఫ్టుల సర్దుబాటు లేదా ఆలస్యంగా వచ్చేందుకు లేదా మధ్యలో వెళ్లి ఓటు వేసి వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ కోరారు.

తీన్మార్ ప్రచారం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః వరంగల్ – ఖమ్మం– నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న వరంగల్ లో ప్రచారం నిర్వహించారు. మండిబజార్ జెండా వద్ద ప్రార్థన చేశారు. స్థానిక ముస్లీంలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ముందుగా సీకెఎం లో ప్రచారంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రహత్ పర్వీన్, 25వ డివిజన్ ప్రెసిడెంట్ సాజిద్, జిల్లా మైనారిటీ విభాగం వైస్ ఛైర్మన్ మహమ్మద్ జమీరుద్దీన్, గ్రేటర్ వరంగల్ సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ముహమ్మద్ ఖాజా పాషా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మమ్మద్ తాహిర్, మహమ్మద్ అమీర్ పాషా (చోటు), ఫర్హాన్, అద్నాన్,చోటు, సోహైల్, రషీద్,ఆఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న

ప్రశాంతంగా పాలిసెట్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః పాలిసెట్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. వరంగల్ లో 3100 అబ్బాయిలకు గాను 2829 మంది హాజరైనారు. 2524 అమ్మాయిలకు గాను 2292 మంది హాజరైనారు. మొత్తంగా 5624 మందికి 5121 మంది (91.05శాతం) పరీక్ష రాసినట్లు పాలిసెట్ వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. వరంగల్, హనుమకొండలో 12 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి బైఠాయింపు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః ప్రేమించి మోసం చేశాడని బట్టల బజార్ లో ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు బైఠాయించిన సంఘటన శుక్రవారం జరిగింది. బట్టల బజార్ కు చెందిన గోవిందరాజ్ తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఉమ ఆరోపించింది. మూడు సంవత్సరాలుగా కలిసి ఉండి రెండు సార్లు అబార్షన్ చేయించాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి నుండి ప్రియుడి ఇంటి ముందు బైఠాయించింది. ఆమె నిరసన వ్యక్తం చేస్తుండటంతో గోవింద రాజ్ కుటుంబం తాళం వేసుకొని వెళ్లిపోయారు. గతంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పుడు కలిసి ఉంటానని చెప్పి మళ్లీ మోసం చేశాడని ఆమె కన్నీరు పెట్టింది. తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతున్నారు.

ఆరుగురు అధికారులపై వేటు

అక్షర దర్బార్, హైదరాబాద్ః తెలంగాణ గనులు, భూగర్భ శాఖలో పని చేస్తున్న అధికారులపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆరుగురు అధికారులపై ప్రభుత్వం వేటు వేసింది. గనుల శాఖలో డిప్యుటేషన్ పై జీఎంలుగా పని చేస్తున్న పాండురంగారావు, దేవేందర్ రెడ్డి, ప్రశాంతి, ప్రాజెక్టు ఆఫీసర్స్ దశరథం, తోట శ్రీధర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ ను మాతృ సంస్థలకు ప్రభుత్వం బదిలీ చేసింది. అధికారుల అవినీతిపై ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

యువతి మృతి, చికిత్స పొందుతున్న యువకుడు

అక్షర దర్బార్, వరంగల్: వరంగల్ లో శుక్రవారం సాయంత్రం ఓ ప్రేమ జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో యువతి మృతి చెందగా తీవ్ర గాయాల పాలైన యువకుడిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వరంగల్ లో హంటర్ రోడ్డులోని పన్నెండు మోరీల సమీపంలో రైల్వే ట్రాక్ పై ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన ప్రేమ జంటలో యువతి మరణించగా యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రేమ జంట ఎవరు, ఎందుకు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు అనే వివరాలను తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించేంది లేదు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- సబ్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు..
- ఏఈ, ఆపరేటర్ల పనితీరుపై ఆగ్రహం

అక్షర దర్బార్, రేగొండ: ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా విద్యుత్ అధికారులు పనిచేస్తే సహించేది లేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేగొండ సబ్ స్టేషన్ లో రికార్డులను పరిశీలించారు. ఏఈ కనకయ్య, ఆపరేటర్ల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనరావుపేట ఫీడర్ లో 11 గంటల విద్యుత్ నిలుపుదలకు కారణం ఏంటని మండిపడ్డారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ ను 24 గంటలు అందిస్తోందని, ముందస్తు సమాచారం లేకుండా గంటల తరబడి విద్యుత్ ను నిలిపివేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, నాయకులు పున్నం రవి, గంగుల రమణా రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

మాలధారులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే

హనుమాన్ మాలధారులకు అన్నదానం

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : గణపురం మండలం బుద్దారం గ్రామంలోని శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆంజనేయ స్వామి మాలధారకులకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు స్వాములకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్ రెడ్డి, ఆర్ఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ రాంనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మరుగు దొడ్లు నిర్మించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలలలో కొనసాగుతున్న పనుల పురోగతిపై విద్యా, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీరాజ్ ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీరింగ్ అధికారులు, ఏపీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా జిల్లా వ్యాప్తంగా 420 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, తాగు నీరు, విద్యుత్ సరఫరా, మరమ్మతు పనులు చేయించడం జరుగుతుందన్నారు. జూన్ 12 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రామ్ కుమార్, డీఆర్డీవో నరేష్, డీపీవో నారాయణ రావు, ఆర్ డబ్ల్యూ ఎస్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

అక్షర దర్బార్, నర్సంపేట/ఖానాపూర్ : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్, ఖానాపూర్ ఐనయ్యపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పీఏసీఎస్, ఎఫ్ పీవో, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బాయిల్డ్ మెష్ కు ట్యాగ్ చేస్తూ వందశాతం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో ట్రైని ఐఏఎస్ రేవంత్ చంద్ర, డీఆర్డీవో కౌసల్యాదేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి శివప్రసాద్ రెడ్డి, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా కోఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రవీందర్ రావుకు ఎమ్మెల్యే దొంతి పరామర్శ..

అక్షర దర్బార్, నర్సంపేట : ఆగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తక్కల్లపల్లి రవీందర్ రావు తల్లి ఆగమ్మ ప్రథమ వర్ధంతికి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని రాజేందర్, కౌన్సిలర్ ఎలగంటి విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గాజుల రమేష్, దండెం రతన్ కుమార్, అచ్చుతం శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ప్రచారం చేస్తున్న ఎంపీపీ కందగట్ల కళావతి

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి-

అక్షర దర్బార్, సంగెం : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ కళావతి అన్నారు. సంగెం మండల కేంద్రంలో శుక్రవారం ఆమె ప్రచారం చేశారు. తీన్మార్ మల్లన్న ప్రజా సమస్యలపై ప్రశ్నించే ధైర్యం ఉన్న నాయకుడని అన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టిపల్లి రమేష్, ఎంపీటీసీ మెట్టిపల్లి మల్లయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆగపాటి రాజు, ఎంఎల్సీ బూత్ ఇంచార్జీలు ఆగపాటి రామకృష్ణ, గుండేటి రాజేష్, సీనియర్ నాయకులు పులి సాంబయ్య, మునుకుంట్ల మోహన్, మునుకుంట్ల శ్రీను, తేలుకలపెల్లి అనిరుద్, ఉండీల మల్లికార్జున్, మెట్టిపల్లి కృష్ణ, పులి రాజశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో గడువులోగా పనులు పూర్తి కావాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

అక్షర దర్బార్, నర్సంపేట : గడువులోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ పీ. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం మహేశ్వరానికి చెందిన మహేశ్వరి పరమేశ్వరి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో తయారు చేస్తున్న ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి దుస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ రేవంత్ చంద్ర, ఆర్డీవో కౌసల్య దేవి, నోడల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు భారీగా ఏర్పాట్లు..

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో బహిరంగ సభ

అక్షర దర్బార్, హైదరాబాద్: జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఈసీ ప్రభుత్వానికి అనుమతి ఇవ్వడంతో, అందుకు తగిన విధంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా గన్ పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్ల పై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలను కేటాయించేటప్పుడు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. ప్రజలు ఎండకు గురికాకుండా బారికేడింగ్ ఏర్పాటు చేసి, షామియానాలతో నీడ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం పరిసర ప్రాంతాలలో పారిశుద్య పనుల నిర్వహణ, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. డీజీపీ రవిగుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అథర్ సిన్హా, ముఖ్య కార్యదర్శులు బి వెంకటేశం, జితేందర్, కార్యదర్శులు క్రిస్టినా జోంగ్తు, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్ రెడ్డి, టీఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్, సీడీఎంఏ దివ్య, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

- పేరుకే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి
- పరికరాలు ఉన్నా నిరుపయోగమే
- ప్రారంభంకాని ఎమర్జెన్సీ సర్వీసెస్
- ఇదీ పీఎంఎస్ఎస్ హాస్పిటల్ తీరు

నిర్లక్ష్యపు జబ్బు

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆగిపోయిన ఆపరేషన్లు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: కాకతీయ వైద్య కళాశాల ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆపరేషన్లు నిలిచిపోయాయి. ప్రధాన మంత్రి స్వస్థ్య సురక్ష యోజన కింద ప్రభుత్వం కాకతీయ వైద్యకళాశాల ఆవరణలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. తాజాగా ఈ హాస్పిటల్ లో ఆపరేషన్లు నిలిచిపోవడం విమర్శలకు తావిస్తోంది. గత కొద్ది రోజులుగా ఆపరేషన్లు చేయకపోవడంతో బాధితులు ప్రయివేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని చికిత్సలకు ఆరోగ్య శ్రీ కింద ఉన్నా మరికొన్ని ఆరోగ్యశ్రీ పథకంలో లేవు. దీంతో ప్రయివేట్ లో డబ్బులు పెట్టి చికిత్స చేయించుకుంటున్న దుస్థితి. ఆసుపత్రిలో ఏసీలు పనిచేయని కారణం, ఇతర కారణాలతో యూరాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, ఆంకాలజీ, న్యూరో, పిడియాట్రిక్ విభాగాల్లో సర్జరీలు జరగడం లేదు. దీంతో ఆయా విభాగాల్లోని పరికరాలు నిరుపయోగంగా మారాయి.

కాకతీయ వైద్య కళాశాలలను అప్ గ్రేడ్ చేసే క్రమంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి కేంద్రం నిర్ణయం తీసుకుని ఆ దిశగా అడుగులు వేసి కేఎంసీ ప్రాంగణంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. మొత్తం 249 పడకలు ఇందులో 39 ఐసీయూ బెడ్స్ ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్లు 8 నిర్మించారు. కేంద్ర కాబినేట్ కమిటీ ఆఫ్ ఎకనమిక్ అఫైర్స్ (సీసీఈఏ) ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అప్ గ్రేడ్ చేసేందుకు అప్రూవ్ చేసింది. థర్డ్ ఫేజ్ కింద వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ తో పాటు దేశంలోని 31 మెడికల్ కాలేజీలను ఈ ఫేజ్ లో అప్ గ్రేడ్ చేసింది. నవంబర్7, 2013లో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తం రూ.150కోట్లలో కేంద్రం వాటా రూ.120కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.30కోట్లు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. ఈ నూతన ఆసుపత్రిలో కావాల్సిన ఆధునిక పరికరాలను సమకూర్చారు. నిర్మాణం వేగంగా జరిగినప్పటికి సిబ్బంది నియామకంలో జాప్యం జరిగి ఆలస్యంగా ఆసుపత్రిలో సేవలు ప్రారంభమయ్యాయి. అధిక శాతం మంది ఉద్యోగులు అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారు.

కార్డియాలజీ, కార్డియో తోరాసిక్ వాస్క్యులర్ సర్జరీ, మెడికల్ ఆంకాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ, పీడియాట్రిక్ సర్జరీ విభాగాలు ఏర్పాటు చేశారు. కార్డియాలజీ, కార్డియో తోరాసిక్ వాస్క్యులర్ సర్జరీ,మెడికల్ ఆంకాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాల బాధితులకు సోమ, బుధవారాల్లో అవుట్ పేషెంట్(ఓపీ) విభాగం నడిపిస్తున్నారు. మిగిలిన విభాగాలకు మంగళ, గురువారాల్లో ఓపీలో వైద్యసేవలందిస్తున్నారు. పేషంట్ల ఆరోగ్యస్థితి బట్టి అడ్మిట్ చేసుకోవడమో లేదా నిర్ణయిస్తున్నారు. త్వరగా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు సమకూర్చి ఆపరేషన్లు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఎమర్జెన్సీ సర్వీసెస్ ను కూడా ప్రారంభించాలని ఆకాంక్షిస్తున్నారు. ఆసుపత్రిలో అర్హత గల నిపుణులను చేర్చుకోవాల్సి ఉంది. అవుట్ సోర్సింగ్ ద్వారా ఆసుపత్రిలో నియామకమైన వారిలో చాలా మందికి పనిరాదనే ఆరోపణలు ఉన్నాయి. పనివచ్చిన వారిని విధుల్లోకి తీసుకోవాల్సి ఉంది.

ఎమర్జెన్సీ ఉంటే ఎంజీఎంకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోగి పరిస్థితిని బట్టి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఓపీకి వచ్చిన వారిని పరిశీలించి అవసరాన్ని బట్టి అడ్మిట్ చేసుకుంటున్నారు తప్పితే అత్యవసరంగా సూపర్ స్పెషాలిటీకి వెళితే చేర్చుకోవడం లేదు. తిరిగి ఎంజీఎంకే పంపిస్తున్నారు. రోగి అటూ ఇటూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితి ఏర్పడకుండా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ సర్వీసెస్ ప్రారంభించాలని ప్రజల నుంచి డిమాండ్ ఉంది. ఈ దిశగా పాలకులు అడుగులు వేయాలని కోరుతున్నారు.

మానుకోట పట్టణంలో బైక్ పై పర్యటిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్

మానుకోటపై ఎస్పీ నజర్

- హెల్మెట్ ధరించి పట్టణంలో బైక్ పై పర్యటించిన కేకన్

అక్షర దర్బార్, మహబూబాబాద్: మానుకోట జిల్లాపై ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో తనదైన మార్పును చూపిస్తున్నారు. తాజాగా బైక్ పై పర్యటించి క్షేత్రస్థాయిలోని విషయాలను తెలుసుకోవడం చర్చనీయాంశమైంది. హెల్మెట్ ధరించి సివిల్ డ్రెస్ లో జిల్లా కేంద్రంలోని పలు వీధుల్లో పర్యటించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇటీవల కాలంలో శాఖపరమైన కఠిన నిర్ణయాలు తీసుకోవడంతో పోలీసు శాఖలో స్ట్రిక్ట్ ఆఫీసర్ గా ముద్రపడింది. జిల్లా పోలీస్ బాస్ కింది స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేస్తూ శాంతి భద్రతలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. పోలీసు శాఖలోని పలు విభాగాల అధికారులను అప్రమత్తం చేసి జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని సమాచారం సేకరించి అందుకుతగ్గట్టుగా వ్యవహరిస్తున్నారు.

ఆరో విడత పోలింగ్‌కు సిద్ధం

- 58 స్థానాల్లో 889 మంది బరిలో
- ఏర్పాట్లు చేసిన ఎన్నికల కమిషన్

అక్షర దర్బార్, హైదరాబాద్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆరో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారంతో ఎన్నికల ప్రచారం ముగియగా, శనివారం 6 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 స్థానాల్లో ఈ విడత పోలింగ్ జరగనుంది. ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మక ప్రాంతాలకు అదనపు బలగాలను పంపించింది. 58 స్థానాల్లో 889 మంది బరిలో నిలిచి వారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఎన్నికలకు కావాల్సిన ఈవీఎంలు, ఇతర సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు పంపింది. ఈ విడతలో హరియాణాలోని 10, ఢిల్లీలోని 7 సీట్లకూ ఎన్నిక జరగనుంది. జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానానికి మూడో విడతలో భాగంగా మే 7న పోలింగ్ జరగాల్సి ఉండగా, కనెక్టివిటీకి సంబంధించిన లాజిస్టికల్, కమ్యూనికేషన్ వంటి అడ్డంకులు తలెత్తాయి. దీంతో మే 25న ఆరో విడతలో ఆ స్థానానికి పోలింగ్ నిర్వహించనున్నారు. ఆరో దశ పోరులో హరియాణాలో అంబాలా, కురుక్షేత్ర, సిర్సా, హిసార్, కర్నాల్, సోనిపట్, రోహ్తక్, భివానీ-మహేంద్రగఢ్, గురుగ్రామ్, ఫరీదాబాద్‌లో పోలింగ్ జరగనుంది. బీజేపీ మొత్తం 10 స్థానాల్లో పోటీ చేస్తోంది. కురుక్షేత్రను ఆమ్ ఆద్మీ పార్టీకి కేటాయించిన కాంగ్రెస్, మిగిలిన 9 స్థానాల్లో బరిలోకి దిగింది. ఈసారి కర్నాల్‌లో పోరు ఆసక్తి రేకెత్తిస్తోంది. 2014, 2019లలో ఇక్కడ బీజేపీనే విజయం సాధించింది. ఈసారి బీజేపీ తరపున మాజీ సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ బరిలో ఉన్నారు. కురుక్షేత్ర లోక్‌సభ స్థానంలో ఈసారి బీజేపీ తరపున నవీన్ జిందాల్ పోటీ చేస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి సుశీల్ గుప్తా, ఐఎన్‌ఎల్‌డీ అభ్యర్థిగా అభయ్ సింగ్ చౌటాలా బరిలో ఉన్నారు. న్యూ ఢిల్లీ పోరుపై ఈ దఫా ఆసక్తి నెలకొంది. ఆ స్థానంలో కేంద్ర మాజీ మంత్రి సుష్మ స్వరాజ్ కుమార్తె భన్సురీ స్వరాజ్ పోటీ చేస్తున్నారు.

గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో న్యూ ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ తరఫున మీనాక్షీ లేఖీ గెలిచారు. ఈశాన్య ఢిల్లీ స్థానంలో బీజేపీ గత రెండు ఎన్నికల్లో విజయం సాధించింది. హ్యాట్రిక్ సాధించాలని బీజేపీ నేత మనోజ్ తివారీ తహతహలాడుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్ బరిలో ఉన్నారు. జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానం ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మాజీ సీఎం, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధినాయకురాలు మెహబూబా ముఫ్తీ బరిలో ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ నుంచి మియా అల్తాఫ్, అప్నీ పార్టీ తరఫున జఫర్ ఇక్బాల్ మన్హాస్ రంగంలోకి దిగడంతో త్రిముఖ పోరు కనిపిస్తోంది. ఆరో విడతలో ఒడిశాలోని భువనేశ్వర్, పూరీ, ఢెంకనల్, కియోంజర్, కటక్, సంబల్పూర్ లోక్‌సభ స్థానాలతో పాటు 42 అసెంబ్లీ సీట్లకు పోలింగ్ జరగనుంది. చాలా స్థానాల్లో బీజేపీ, బీజేడీ మధ్యే పోటీ నెలకొంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ దఫా 14 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. సుల్తాన్‌పూర్‌లో సిట్టింగ్ ఎంపీ బీజేపీ అభ్యర్థి మేనకా గాంధీ , సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి రాంభువల్ నిషాద్ మధ్య పోరు జరుగుతోంది. చివరిదైన ఏడో విడత జూన్ 1న జరగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: ఈ నెల 27న నల్లగొండ-వరంగల్ -ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి(వరంగల్, హనుమకొండ, జనగామ)లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఓ ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈ నెల 27వ తేదీ ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ పేర్కొన్నారు. బహిరంగ సభలు,ర్యాలీలు నిషేధం ఉంటుందని, ఎన్నికల వేళ పోలింగ్ కేంద్రాల చుట్టూ గుమిగూడరాదని, పోలింగ్ కేంద్రం నుండి 200 మీటర్ల హద్దును దాటి ఓటర్లు తప్ప ఎవ్వరు లోపలికి రాకూడదని ఆయన సూచించారు. ప్రజలు పోలీస్ అధికారులకు,సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎవరైనా నియమ నిబంధనలు పాటించకుండా ఇబ్బందులకు గురిచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.